క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్య పల్లెలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ మేరకు నిర్వాహకులు మాట్లాడుతూ తిరుపతిలోని అర వింద కంటి ఆస్పత్రి వైద్యులతో శిబిరం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న ఉమాపతి

కార్వేటినగరం: రాస్ స్వచ్ఛంద సంస్థ వారు కార్వేటినగరంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం లో దాతలు ఉమాపతి, కిషోర్, కిరణ్‌కుమార్ శనివారం అన్నదానం చేశారు. ఉమాపతి మాట్లాడుతూ పెరటాసి నెలలో అన్నదానం చేయడం మహా భాగ్యమన్నారు. కార్యక్రమం లో రాస్ కో–ఆర్డినేటర్ ప్రకాష్ పాల్గొన్నారు.

డైట్‌లో కళావేదిక ప్రారంభం నేడు



కళావేదిక భవనం

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణ కేంద్రం (డైట్)లో నూతనంగా నిర్మించిన కళావేదిక భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు పూర్వ విద్యార్థి, ఎస్టీయూ నేత గాజుల నాగే శ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లా డుతూ 1985–86 పూర్వ విద్యార్థులు రూ.6లక్షల వ్యయంతో కళావేదికను నిర్మించి నట్లు వెల్లడించారు. నిత్యం ప్రార్థనలతోపాటు విద్యాసంబంధ సమావేశాలు, కళలు, సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడేలా కళావేదికను నిర్మించి, తమ గురువులకు దక్షి ణగా అందజేస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు డైట్ ప్రిన్సిపల్, డీఈఓ డాక్టర్ వరలక్ష్మి చేతులమీదుగా కళావేదిక భవనం ప్రారంభిం చనున్నట్లు తెలిపారు.

నత్తనడకన ఈ క్రాప్ నమోదు

గుడిపాల: మండలంలో నత్తనడకన ఈ– క్రాప్ నమోదు జరుగుతున్నట్లు వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. మండలంలో 50,220 సర్వే నంబర్లు ఉండగా ఇప్పటి వరకు 3322 నం బర్లు మాత్రమే నమోదైనట్లు చెప్పారు. ఈ సం దర్భంగా ఆమె అగ్రికల్చర్ అసిస్టెంట్ల సమావే శంలో మాట్లాడుతూ ఈనెల 25వ తేదీకి ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని వారికి తెలియజేశారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాసులు నత్తనడకన ఈ–పంట నమోదుపై వ్యవసాయా ధికారిని పిలిపించి వివరాలు అడిగారు.

జూపార్క్‌లో కీపర్స్ డే

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : ఎస్వీ జూపా ర్క్‌లో శనివారం అంతర్జాతీయ జూ కీపర్స్‌డే నిర్వహించారు. క్యూరేటర్ సి.సెల్వం, సహాయ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ మాట్లా డుతూ వన్యప్రాణి సంరక్షణతో జూ కీపర్స్ అం దిస్తున్న సేవలు అమూల్యమన్నారు. జంతు ఉద్యానవనానికి నిజమైన పరిరక్షకులుగా విధులు నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం విశిష్ట జంతు పరిరక్షకులను సత్క రించి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు..
క్షమించరాని తప్పు


నిరసన తెలుపుతున్న ఎస్సీ నాయకులు, మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నగరిలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న అఖిల పక్ష నాయకులు

- విగ్రహానికి పాలాభిషేకం
- నిందితులను వెంటనే అరెస్టు చేయాలని నిరసన
- మద్దతు పలికిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

విజయపురం: వెదురుకుప్పం మండలం, దేవళంపే టలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం క్షమించరాని తప్పని మండలంలోని దళిత నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవళంపే టలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన సంఘట నపై మండలంలోని దళితనేతలు నిరసన తెలి పారు. ఎంపీపీ మంజు బాలాజీ ఆధ్వర్యంలో శనివారం పన్నూరు సబ్‌స్టేషన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్న వారు విగ్రహానికి పాలా భిషేకం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ అంటే ఒక వ్యక్తి కాదని మహాశక్తి అన్నారు. భారత రాజ్యాంగాన్ని రాసిన మహనీయుడన్నారు. అలాం టి మహనీయుని విగ్రహానికి నిప్పుపెట్టిన వారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.డాక్టర్ అంబేడ్కర్ విగ్రహంపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పు అంటించే స్థాయికి పరిస్థితులు దిగజారిపోయాయంటే రక్షణ వ్యవస్థ ఏమి చేస్తున్నట్లని ప్రశ్నించారు. దాడికి పాల్పడి వ్యక్తులకు వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘ టన పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవా ల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో ఇలాంటి సంఘటన ఎక్కడ జరగలేదన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే అన్నారు.

నిందితులు కఠినంగా శిక్షించాలి

నగరి: డాక్టర్ అంబేడ్కర్ దళితులకే నాయకుడు కాదని, భారతదేశంలో ఉన్న ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగాన్ని అందించారని, ప్రపంచ దేశాల్లో అం బేడ్కర్‌ని ఒక దేవుడిలా కొలుస్తారని, అలాంటి ప్రపంచ మేధావి విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తూ నగరి అఖిల భారత యువజన సమైక్య ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. నగరి బస్టాండ్ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాల వేశారు. తప్పు ఎవరు చేసినా, ఎంతటి వారైనా కఠినంగా శిక్షిం చాలని డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేయకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువ జన సంఘం నాయకులు జేమ్స్, సురేష్, రాజ్కోటి, నేతాజీ, నరేష్, మారన్ ప్రతాప్, ప్రజా సంఘాల నాయకులు కోదండయ్య, వేలన్ రవి, సుశీల్ బాబు, నాగరాజు, అహ్మద్, రవి, బాషా శ్రీనివాసన్, శిరవు ద్దిన్ కుప్పన్ యువకులు పాల్గొన్నారు.

దారుణమైన చర్య



అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పు అంటించడం దారుణమైన చర్య. డాక్టర్ అంబే డ్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టడమే కాకుండా చెప్పులు దండ వేయడం ఎంత వరకు న్యాయం. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఇలాంటి సంఘటన మళ్లీ జరగ కుండా చర్యలు తీసుకురావాలి. దాడికి పాల్పడి వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి.

–గోవర్ధన్‌నాయుడు, ఎం. అగరం

రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి



సీఎం చంద్రబాబు జిల్లాలో ఇలాంటి సం ఘటన జరగడం అమానుషం. ఇది ముమ్మాటికి రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యమే. అంబేడ్కర్ విగ్ర హంపై దాడి జరిగినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. వెంటనే నైతిక బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలి.

–గుణశేఖరరెడ్డి, కలియంబాకం

కఠినంగా శిక్షించాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టి, చెప్పుల దండ వేసిన వారిని వెం టన గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఇలాం టి సంఘటన మళ్లీ జరగకుండా ప్రత్యేక చట్టం తీసు కురావాలి. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని కోరుతున్నాం.

–మంజు బాలాజీ, ఎంపీపీ, విజయపురం

న్యాయం జరిగే వరకు పోరాడుతాం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలి. దాడులకు పాల్ప డిన వారిని అరెస్టు చేసే వరకు పోరాడుతాం. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం జరిగింది. ఎస్టీలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుంది.

–కుమార్, సర్పంచ్, పన్నూరు

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం


తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు శనివారం తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తమిళ పెరటాసి నెల మూడో శనివారం కావడంతో ఆల యం భక్తు లతో కిక్కిరిసింది. వేకువ జామున సు ప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంక ర్యాలు నిర్వహిం చారు. సాయంత్రం శ్రీదేవి భూ దేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి విశేషాలంకరణ చేసి, తిరు చ్చిపై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళ వాయి ద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవం గా సాగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు స మర్పించి మొక్కులు తీర్చుకొ న్నారు. అనంతరం స్వామి అమ్మవార్లకు మంగళహార తులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.కార్యక్రమా లను ఆలయ సూపరిండెంటెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షించారు.

స్వయం కృషితో ఉపాధి పెంచుకోవాలి


చెక్కు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎంపీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆటోడ్రైవర్లు స్వయం కృషితో ఉపాధి పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ దగుమళ్ల ప్రసాద్ రావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో శని వారం చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని ఆటో డ్రైవర్ సేవలో అనే కార్యక్రమం నిర్వహించారు. తొలుత ర్యాలీ చేపట్టారు. అనంతరం వారు మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సహకారాన్ని అంది పుచ్చుకోవాలన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలు తీర్చడం కోసం ప్రభుత్వం అన్ని ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తుందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం అందించిన రూ.15000 ఆర్థిక సాయం కుటుంబ అవసరాల కోసం వినియోగించుకునే అవకాశం లభించిందన్నారు. అర్హులైన వారు లబ్ధి దారుల జాబితాలో లేకపోతే సమస్యను పరిష్కరిం చి వారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చుతామ న్నారు. ఆటో, మ్యాక్స్, క్యాబ్ డ్రైవర్లు క్రమశిక్షణగా ఉండాలని, ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించవద్దని హెచ్చరించారు. జిల్లాలో సుమారు 6777 మంది లబ్ధిదారులకు రూ.10.16 కోట్లు లబ్ధిదారుల బ్యాం కు ఖాతాకు జమ అయిందన్నారు. అనంతరం చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని 1402 మంది లబ్ధిదారులకు రూ.2,10,30,000 మెగా చెక్కును పంపిణీ చేశారు. అనంతరం వర్చువల్ విధానం ద్వారా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని సభికులు తిలకిం చారు. కార్యక్రమంలో డీటీసీ నిరంజన్ రెడ్డి, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు పాల్గొన్నారు.

ముగిసిన దసరా పూజలు


ప్రత్యేక అలంకరణలో సామాలమ్మ

నగరి: పట్టణంలోని మోరుకొండ కింద కండ్రిగ మార్గంలోని గ్రామదేవత సామాలమ్మ ఆల యంలో శనివారం దసరా ముగింపు ఉత్సవా లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా అమ్మవారి విగ్రహానికి చేసిన అలంకరణ ఆకట్టుకుంది. వాకర్స్ అసోసియేషన్ సభ్యుల తోపాటు, నగరి పట్టణానికి చెందిన పలువురు భక్తులు ఈ వేడుకలకు దాతలుగా వ్యవహరిం చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్న దానం చేశారు.

936 మంది ఆటోడ్రైవర్లకు రూ.1.4 కోట్లు

గంగాధర నెల్లూరు: ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి ఎమ్మెల్యే డాక్టర్ థామస్ శ్రీకారం చుట్టారు. జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని 936 మంది ఆటో డ్రైవర్లకు రూ 1.4 కోట్ల మెగా చెక్కును అందించారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం సమీపంలో కొండపై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామికి పెరటాసి మాసం మూడో శనివారం సందర్భంగా పావుకూరుకండ్రిగవాసులు ప్రత్యేక పూజ లు నిర్వ హించారు. భక్తులు పూజా సామగ్రితో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సుమారు 20 కిలోల కర్పూరం వెలిగించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా మూడో శనివారం పూజలు


ప్రకాశం రోడ్డులో గోవింద భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు


బైపాస్ మలుపు వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

నగరి : పెరటాశి నెల మూడో శనివారం సందర్భం గా గోవింద భక్తులు తమ ఇళ్లలో ఘనంగా పూజలు చేశారు. ఉదయం నుంచే పట్టణంలోని టీటీడీ ఆధీ నంలో ఉన్న శ్రీభూదేవి, శ్రీదేవి సమేత కరియమా ణిక్యస్వామి ఆలయంలో, సత్రవాడ శ్రీభూనీలా స మేత కరివరదాజ స్వామి ఆలయంలో భక్తులు క్యూ కట్టారు. ప్రత్యేక క్యూలో వెళ్లి స్వామివారిని దర్శిం చుకున్నారు. కరియమాణిక్య స్వామికి ఊంజల్‌సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయాధికారి వెం కటరమణ భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయాల వద్ద దాతలు భక్తులకు అన్నదానం చేశారు. పాదయాత్ర చేసే గోవింద భక్తులకు ప్రకా శం రోడ్డు, బైపాస్ రోడ్డులో దాతలు అన్నదానం చేశారు.

పారిశుద్ధ్యలోపం.. ప్రజలకు శాపం


సిమెంట్ రోడ్డుకిరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు


గ్రామం మధ్యలో పేరుకుపోయిన చెత్త చెదారం


మురికి కాలువను కప్పేసిన పిచ్చిమొక్కలు

- కోసలనగరంలో రాజ్యమేలుతున్న అపరిశుభ్రత
- అడుగడుగునా పిచ్చి మొక్కలు
- గ్రామస్తులకు కంటి మీద కునుకు కరువు
- ఫిర్యాదు చేసి రెండు నెలలైనా పట్టించుకోలేదని ఆరోపణ

విజయపురం: మండలంలోని కోసలనగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ప్రతి వీధిలో రోడ్డుకిరువైపులా పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి, దోమలు వృద్ధి చెందాయి. దీంతో రాత్రి వేళలో కంటి మీద కునుకు లేకుండా ఇక్కట్లు పడుతు న్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వీధుల్లో రాత్రి పూట విష సర్పాల సంచారం చేస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు బయటకు రావడానికి భయపడుతు న్నారు. రెండు నెలలుగా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కోసలన గరంలో సుమారు 150కి పైగా కుటుంబాలు ఉన్నాయి. అయితే మౌలిక వసతులు అంత మాత్రమే. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లకిరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరి గాయి. దీంతో విష సర్పాలు ఆ చెట్లలో చేరాయి. ఏ సమ యంలో ఎటు నుంచి ఏ రకమైన విష సర్పం వస్తుందోనని ప్రజలు భయపడి, పొద్దుపోతే ఆరు బయటకు రావడం లేదు. తప్పనిసరి పరిస్థితిలో బయటకు రావాలంటే టార్చీ లైటు చేత పట్టుకుని రావాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. మురుగు కాలువలో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దోమలు వృద్ధి చెందాయి. దోమల బెడదతో గ్రామ స్తులు ఇక్కట్లు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

స్థానికంగా ఉన్న సమస్యలపై రెండు రోజులుగా ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పంచాయతీకి పనులు జరగకుండా, జరిగినట్లు రికార్డులు సృష్టించి నిధులు స్వాహా చేస్తున్నట్లు స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. అధికా రులు సైతం దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించి కోసలనగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం


ఆదం కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు


ఉధృతంగా ప్రవహిస్తున్న బొమ్మవారిపల్లె వాగు

నగరి: వేకువ జాము నుంచి పగలు 11 గంటల వరకు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాం తాల్లో ఛిద్రమైన కాలువల నుంచి నీరు పైకి ఉబికింది. రోడ్డుపై నీరు నిల్వ చేరడంతో వాహనచోదకుల రాకపోకలకు ఇబ్బందికరం గా మారింది. మధ్యాహ్నం వరకు మబ్బులు కమ్ముకున్నట్లు ఉన్న వాతావరణం ఒక్కసారిగా మధ్యాహ్నం నుంచి మారిపోయింది. యథావిధిగా సూర్యుడు తన ప్రతాపం చూపించాడు.

జీడీ నెల్లూరులో భారీ వర్షం

గంగాధర నెల్లూరు: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శని వారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. సుమారు 82.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలి పారు. బొమ్మవారిపల్లె వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపో కలు నిలిచిపోయాయి. తూగుండ్రం, కొత్త వెంకటాపురం చెరు వులు మొరవపోవడంతో గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారు.

స్విమ్స్‌లో 'నిరంతర వైద్యవిద్య'

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రిలోని అనస్తీషియా, కార్డియాలజీ, సిటీ సర్జరీ విభాగాల ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమాన్ని శనివారం నిర్వ హించారు. పద్మావతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించే ఉద్దేశంతో ప్రత్యేక సదస్సుకు శ్రీకారం చుట్టి నట్లు వెల్లడించారు. కార్డియాలజీ, సీటీ స్కాన్, సర్జరీ, అనస్తీషియా తదితర విభాగాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వనజాక్షమ్మ, అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ అలో సమంతరే, డాక్టర్ రోహిత్ కుమార్, డాక్టర్ వహీద్ ఖాన్, డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.